క్లుప్తంగా

హైస్కూల్‌లో డీఈఓ తనిఖీ



ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) డాక్టర్ అబ్దుల్ హై సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు, పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల ప్రగతి, వీక్లీ టెస్ట్ జవాబు పత్రాలను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి అవగాహనను పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న 'మన ఊరు–మన బడి' కార్యక్రమ అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫారాల పంపిణీ వివరాలపై హెచ్ఎం రాంధన్‌ను అడిగి తెలుసుకున్నారు.

రేపటి నుంచి మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

కమలాపూర్ : మండలంలోని మోడల్ స్కూల్ లోని 6, 7, 8, 9వ తరగతుల్లోని ఖాళీల భర్తీ కోసం ఈనెల 12 నుంచి 14 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.అనిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం లేదనే విషయాన్ని గమనించాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్, ఇతర ధృవపత్రాలతో పాఠశాలకు ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని పేర్కొన్నారు.

'బీసీ బంధు'లో ప్రాధాన్యత కల్పించండి



శాయంపేట : బీసీ బంధు పథకంలో రజక కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలని రజక సంఘం మండల అధ్యక్షుడు జాలిగపు అశోక్ కోరారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించింది. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్ట్ పనులను రజక సంఘానికి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రజకులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆందోళన వెలిబుచ్చారు. రజక వృత్తిదారుల సంక్షేమానికి చొరవ చూపాలని కోరారు.

పడితే ప్రమాదమే.. పట్టించుకునే వారేరి..?



● చెట్టుకు ఒరిగిన విద్యుత్ స్తంభం

శాయంపట : మండలంలోని మైలారం గ్రామ శివారులో జోగంపల్లి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభం భూమి నుంచి బయటికొచ్చి పక్కనే ఉన్న తుమ్మ చెట్టుకు కొమ్మలను ఆసరా చేసుకొని ఒరిగింది. గట్టిగా గాలి వీచినా, స్తంభం బరువుకు చెట్టుకు నుంచి స్తంభం విడిపోయినా దారి వెంట వచ్చి పోయే రైతులు, వాహనదారులపైన పడే ప్రమాదం ఉంది. అయినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే విద్యుత్ స్తంభాన్ని తొలగించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

'ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు'



శాయంపేట : మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాల జరిగాయని ఏబీఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ నాయకులు నాగుల పవన్ కళ్యాణ్, మంద సురేశ్ ఆరోపించారు. ఈ మేరకు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు కలెక్టరేట్‌లో వారు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పవన్ కళ్యాణ్, సురేశ్ మాట్లాడారు. ఐకేపీ నిర్వాహకులు, మిల్లర్లు కలిసి రైతులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఒక్కో రైతుకు రూ.5–10 వేలు తక్కువగా పడ్డాయని చెప్పారు. రైతులు నిర్వాహకులను అడిగితే మిల్లర్లే కట్ చేశారని అంటున్నారని వివరించారు. ఐకేపీ నిర్వాహకులపై, మిల్లర్లపై విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కమలాపూర్ : నిరసన తెలుపుతున్న కార్మికులు



నడికూడలో..



దామెరలో..

కమలాపూర్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జక్కు రాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మిక, సిబ్బంది సమ్మెలో భాగంగా సోమవారం కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని ఏఐటీయూసీ, టీజీకేబీయూ సంఘం నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు డి.రామ్మూర్తి, టీజీకేబీయూ జిల్లా అధ్యక్షుడు జె.రాజు, నాయకులు లచ్చయ్య, బాలరాజు, గ్రామ పంచాయతీ కార్మిక, సిబ్బంది జెఏసీ మండల శాఖ అధ్యక్షులు ఈ.అయిలయ్య, ఉపాధ్యక్షుడు జి.రమేశ్, ప్రధాన కార్యదర్శి వి.రాజయ్య, జిల్లా నాయకులు భాస్కర్, గీత, అరుణ పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మెకు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రైతు విభాగం అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో జీపీ కార్మిక సంఘం జేఏసీ మండల అధ్యక్షుడు పర్శ భాస్కర్, నాయకులు రమేశ్, శంకర్, నాగరాజు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలో జీపీ కార్మికులు, సిబ్బంది వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు నల్ల చిరంజీవి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మాదారపు బొబ్బిలి, ఉపాధ్యక్షుడు గోవిందు ఆనంద్, కోశాధికారులు దండ్రె దేవేందర్, యజ్జం సురేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి మంచాల తిరుపతి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఆదరి రమేశ్, నాయకులు నీలం కుమార్, మంగ సారయ్య, అజయ్, రాజు, రాజమౌళి, మల్లయ్య, ప్రతాప్, కల్పన పాల్గొన్నారు.

'చల్లా' బండారం బయట పెడతాం

● మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

పరకాల : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బండారం బయట పెడతామని స్థానిక మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత మొలుగూరి భిక్షపతి హెచ్చరించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్‌తో కలిసి భిక్షపతి మాట్లాడారు. చంద్రగిరి గుట్టల సమీపంలో రైతుల నుంచి బలవంతంగా ఎకరానికి రూ.3 లక్షలు చొప్పున చెల్లించి కొనుగోలు చేసి వాటినే ఎకరానికి రూ.25 లక్షలకు చొప్పున అమ్ముకొని రైతులను మోసం చేసిన చరిత్ర కలిగిన ఎమ్మెల్యే ధర్మారెడ్డి ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంటర్ ఫెయిలై ఇంగ్లీషు ముక్క రాయరాని ఎమ్మెల్యే ధర్మారెడ్డి తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయచందర్‌రెడ్డి మాట్లాడుతూ కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ కేసీఆర్, కేటీఆర్ తెచ్చారని గొప్పలు చెప్పుకుంటున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రధాన మంత్రి మిత్ర నుంచి మంజూరైన విషయం తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చల్లా ధర్మారెడ్డి క్షమాపణ చెప్పకపోతే ప్రజలు ఖచ్చితంగా బుద్ధి చెబుతారని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జ సత్యనారయణ, కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ ఆర్పీ.జయంత్ లాల్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, పట్టణ కమిటీ అధ్యక్షుడు మార్త భిక్షపతి, నాయకులు దుబాసి వెంకటస్వామి, గాజుల నిరంజన్, కె.విజయ్ కుమార్, గోగుల రాజిరెడ్డి, సంఘం పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'



అవగాహన కల్పిస్తున్న లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి

ఐనవోలు : బాధిత మహిళలకు 'సఖి–వన్ స్టాప్ సెంటర్' అండగా ఉంటుందని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ఫంక్షన్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో వారు మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు చట్టాల వినియోగించుకునే తీరుపై అవగాహన కల్పించడంతోపాటు 'సఖి' ద్వారా అందుతున్న 5 రకాల సేవలను వివరించారు. సఖి సెంటర్‌లో విడిపోయే భార్యాభర్తలకు కౌన్సిలింగ్, వరకట్న వేదింపులు, లైంగిక వేదింపులు, గర్భ విచ్చిత్తి తదితరాల వేదింపులకు సంబంధించిన అంశాలకు పరిష్కారాలు లభిస్తాయని చెప్పారు. మహిళలు, బాలికల రక్షణే లక్ష్యంగా 'సఖి' కేంద్రం పని చేస్తోందని తెలిపారు. బాధిత మహిళలకు కౌన్సిలింగ్ నిర్వహించడంతోపాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సహాయం అందిస్తారని వివరించారు. సఖి సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. బాధిత మహిళలు, బాలికలు 0870–245112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

'సిరికొండ'కు టికెట్ ఇవ్వాలని పూజలు



శాయంపేట : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ టికెట్‌ను మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారికి ఇవ్వాలని కోరుతూ ఆయన అభిమానులు స్థానిక శ్రీ శివ మార్కండేయ ఆలయానికి సోమవారం మెట్లపై మోకాళ్ల మీద నడిచి పూజలు చేశారు. వంద కొబ్బరి కాయలు కొట్టారు. ఈ సందర్భంగా సిరికొండ యువసేన నాయకుడు కొత్తగట్టు సాయికృష్ణ మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి సిరికొండ మధుసూదనాచారి చొరవ కీలకమని చెప్పారు. కొప్పుల వంతెన, మాందారిపేట నుంచి మల్లంపల్లికి బీటీ రోడ్డు, అన్ని గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు మధుసూదనాచారి మంజూరు చేయించినవేనని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అరికిల్ల విజయ్, అడప ప్రభాకర్, బేరుగు రాకేశ్, గుర్రం ఆకాశ్, నిమిత బాజి అశోక్, బూర విజయ్, గణేశ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు

● మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సొంత స్థలం కలిగిన పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేస్తామని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నేత అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో 'పల్లెపల్లెకు ప్రవీణన్న.. గడప గడపకు కాంగ్రెస్' నినాదంతో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత గ్రామ కూడలిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేశారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న సీఎం కేసీఆర్ హామీలో భాగంగా కనీసం ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ హయంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చామన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టించిన దాఖలాల్లేవని చెప్పారు. హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. గ్యాస్, పెట్రోల్, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన పలువురికి ప్రవీణ్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుకినె సంతాజీ, ఎంపీటీసీ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌లు చల్లా మల్లారెడ్డి, దాట్ల రాముడు, నాయకులు ముప్పు మహేందర్, మండ సుమన్‌గౌడ్, హింగె శ్రీకాంత్, పెండ్యాల తిరుపతి, ఈర రమేశ్, బత్తిని రవీందర్, ముప్పు శ్రీనివాస్, మొలంగూరి భాస్కర్, రత్నాకర్, భాస్కర్, బాబురావు, సుదర్శన్‌రెడ్డి, గూడెం లింగయ్య, దయాకర్, చందర్‌రావు, రమేశ్, సాగర్, దిలీప్, ధినేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులకు పట్టాల పంపిణీ



పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

హన్మకొండ అర్బన్: జిల్లాలోని శాయంపేట మండల పరిధిలోని గంగిరేణిగూడెం, కాట్రపల్లి, సాధనపల్లి, సూర్యనాయక్ తండాకు చెందిన పలువురు పోడు రైతులకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సుమారు 64 ఎకరాల పోడు హక్కుపత్రాలను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆదివాసీలు, గిరిజనులకు భూమి యాజమాన్య హక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు. గిరిజనులు వారికి కల్పించిన హద్దుల మేరకే సాగు చేసుకోవాలని, అడవులు, చెట్లను నరుకుతూ సాగు చేయకూడదని చెప్పారు. కార్యక్రమంలో వరంగల్ జెడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి, ఐటీడీఏ పీఓ అంకిత్, డీఎఫ్ఓ వసంత, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గారు.. ఆదుకోరూ



పరకాల: పట్టణంలోని బుడిగజంగాల కాలనీకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పస్తం రమేశ్ ఆర్నెళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో గాయపడగా ప్రస్తుతం అతడి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో రోడ్డున పడే దుస్థితి నెలకొంది. రమేశ్ సూర్యాపేట వెళ్లి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రమేశ్ కాలుకు తీవ్ర గాయమైంది. వైద్యానికి రూ.26లక్షలు ఖర్చైనా ఇన్‌ఫెక్షన్ తగ్గని కారణంగా వైద్యులు ఎడమ కాలిని తొలగించారు. దీంతో రమేశ్ ఆర్థికంగా చితికిపోయాడు. పిల్లల చదువు, కుటుంబ పోషణ భారంగా మారింది. తమను మంత్రి కేటీఆర్ ఆదుకోవాలని రమేశ్, అతడి భార్య, పిల్లలు కోరుతున్నారు.

'నాగుర్ల'కు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలి



విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారులు

ఆత్మకూరు : బీఆర్ఎస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ నాగుర్ల వెంకటేశ్వర్లుకు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సందెల సునీల్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఆత్మకూరు, దామెర మండలాల ఉద్యమకారుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సాధనలో క్రియాశీలకంగా ఉద్యమించిన ఉద్యమకారులు తగిన ప్రాధాన్యత లభించక వేదనకు గురౌతున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌లో ఉన్న తెలంగాణ ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ఆకాంక్షించారు. ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితబంధు, ఇతర సంక్షేమ పథకాల వర్తింపులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డికి తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేకపోవడంతో ఆయన ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. అలాగే ఎమ్మెల్యేగా ధర్మారెడ్డి ఉద్యమకారులకు చేసిందేమీ లేదన్నారు. తొలుత ఉద్యమకారులు మండల కేంద్రంలో ర్యాలీగా వెళ్లి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి ఉద్యమకారుల డిమాండ్లను తెలుపుతూ ముద్రించిన వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం రఘు, ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు, మాజీ కోఆప్షన్ సభ్యుడు బాబువియా, నాయకులు అంకతి రవి, శంకర్‌రావు, కొంగ సురేందర్, లింగమూర్తి, గణపతి, దొంకదువ్వ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న హెచ్ఎం లింగారావు

ఐనవోలు : మండలంలోని పలు పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 16 వరకు గ్రంథాలయం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి విద్యార్థులతో కథల పుస్తకాలు చదవించి వారిలో పఠనాసక్తిని పెంపొందించనున్నారు. ఈ సందర్భంగా ఉడుతగూడెం పాఠశాలలో హెచ్ఎం చుంచుకాల లింగారావు బ్యానర్ ఏర్పాటు చేసి పుస్తక పఠన ప్రాముఖ్యతను విద్యార్థులు వివరించారు. ధారాళంగా చదవడం, చదివింది అర్థం చేసుకుని రాయడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని ఆయన తెలిపారు. ఐనవోలు స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులతో కథలు చదివించి వాటిలో తోటి విద్యార్థులకు తప్పులు లేకుండా వివరించేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధూకర్, బీమళ్ల సారయ్య, ఉమాదేవి, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, సీఆర్పీ రేవతి తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు'ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మనోహర్, నాయకులు

ఎల్కతుర్తి : దళితబంధు పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని కోరుతూ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీహెచ్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు నాయకులు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ మాట్లాడారు. దళితబంధు పథకానికి ఎవరికి దరఖాస్తు చేసుకోవాలో ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదన్నారు. అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల జోక్యాన్ని నివారించి కలెక్టర్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న పేదలకు కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు చొప్పున ఇవ్వాలని, ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు పట్టాలివ్వాలని, అర్హులకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రొంటాల దేవా, నాయకులు మద్దెల ఎల్లేష్, శనిగరం రాజ్‌కుమార్, రాసమల్ల కుమార్, మునిగాల భిక్షపతి, శంకర్‌నాయక్, వేల్పుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఉద్యోగులు, సిబ్బంది అలర్ట్

సకాలంలో విధులకు హాజరు

● పరిసరాలు క్లీన్ అండ్ గ్రీన్

సాక్షి ఎఫెక్ట్..



చెత్త తొలగిస్తున్న కార్మికుడు

శాయంపేట : 'ఉదయం రారు.. సాయంత్రం ఉండరు..' శీర్షికతో ఈనెల 8న 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందన లభించింది. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఉద్యోగులు, సిబ్బంది సోమవారం అలర్ట్ అయ్యారు. సకాలంలో విధులకు హాజరయ్యారు. కంపుకొడుతున్న మరుగుదొడ్లను శుభ్రం చేయించారు. చెత్తాచెదారాన్ని తొలగించి క్లీన్ అండ్ గ్రీన్ చేయించారు. త్వరలోనే గడువు ముగిసిన మందులను, వాడి పడేసిన సూదులను ప్రత్యేక గుంత తవ్వి సిమెంట్ రింగులు వేసి పిట్ ఏర్పాటు చేయించి అందులో వేస్తామని వైద్యాధికారి సాయి కృష్ణ తెలిపారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరౌతుండడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ ఎక్కడ?



చెత్త కాల్చడంతో వెలువడుతున్న పొగ

శాయంపేట : ఇండ్ల నుంచి సేకరించిన చెత్తాచెదారాన్ని రోడ్డు పక్కనే కుప్పగా పోసి దహనం చేస్తున్నారు. మండలంలోని పెద్దకోడెపాకలో ఈ పరిస్థితి చోటు చేసుకుంది. జీపీ కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి సిబ్బందితో రోడ్డు పక్కనున్న పిచ్చి మొక్కలను చెత్తాచెదారాన్ని కుప్పలుగా పోసి దహనం చేయించడంతో పొగ వెలువడుతోంది. ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది.

చదువుతోనే బంగారు భవిష్యత్



దామెర : చదువుతోనే బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయని ముస్త్యాలపల్లి సర్పంచ్ వడ్డేపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండలంలోని ఆ గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు సోమవారం రూ.8 వేలు విలువైన నోట్ పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. విద్యార్థులు చదువులపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి మెరుగైన ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడానికి ప్రభుత్వం, ఉపాధ్యాయులు చొరవ చూపుతుండడం అభినందనీయమని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఉచితంగా అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పరమేశ్వర్, సత్యనారాయణ, శ్రీలత, ఉపాధ్యాయులు, సీఆర్పీ నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికులకు బిల్లులు చెల్లించాలి

ఎల్కతుర్తి : మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. కార్మికులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిత్యావసర వస్తువుల, ఆహార సరఫరాను ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టడం సరికాదన్నారు. ప్రతినెలా 5లోపు బిల్లులు చెల్లించాలని, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు వండి, వడ్డించినందుకు వేతనాలు చెల్లించాలని, పెరుగుతున్న కోడిగుడ్ల, గ్యాస్, ఇతర నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ప్రేమ్ పావని, సీపీఐ జిల్లా కార్యదర్శి అదరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.